సాక్షి మంచిర్యాల

ఆదివారం । 2 । జూన్ । 2024



సర్దుబాటు చదువులేనా..?
ప్రభుత్వ పాఠశాలల్లో ఏళ్ల తరబడి ఖాళీలు భర్తీ కాక గందరగోళంగా మారుతోంది. గతేడాది మాదిరిగానే ఉపాధ్యాయులను డిప్యూటేషన్ చేయనున్నట్లు తెలుస్తోంది. 8లో▸



5 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు..
నెన్నెల మండలం బొప్పారంలో ఐదు క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రామగుండం సీపీ శ్రీనివాసులు తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
41.6 /28.8

వాతావరణం
ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వేడి, ఉక్కపోత అధికంగానే ఉంటుంది. సాయంత్రం వర్షం కురిసే అవకాశం ఉంది.

పాలన చేరువై.. వసతులు మెరుగై..



- స్వరాష్ట్రంలో జిల్లా అభివృద్ధి బాట
- పదేళ్లలో జిల్లాలో అనేక మార్పులు..
- అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలకు మేలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావంతో జిల్లా అభివృద్ధి బాట పట్టింది. గడిచిన పదేళ్లలో అనేక రంగాల్లో కీలక మార్పులు జరిగాయి. జిల్లాల పునర్విభజనతో పాలన చేరువైంది. మంచిర్యాల జిల్లా ఆకాంక్ష నెరవేరింది. విద్య, వైద్యం, వ్యవసాయంతోపాటు పలు రంగా ల్లో అభివృద్ధి పుంజుకుంది. రాజకీయంగా, సామాజికంగా కీలక మార్పులు జరిగాయి. జిల్లాలో మూ డు కొత్త మండలాల ఏర్పాటు, 115 గ్రామ పంచా యతీలు, నాలుగు మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణిలో గతంలో పోలిస్తే ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. అయితే పేద, మధ్య తరగతి జీవితాలు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉంది. అవి నీతి, అక్రమాలు ప్రజలకు శాపంగా మారాయి. వీటిని నిరోధిస్తూ అభివృద్ధివైపు పయనించాలని జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

విద్యా, వైద్యం..
ప్రైవేటు స్కూళ్లతో పోలీస్తే జిల్లాలో ప్రభుత్వ విద్య ఇంకా వెనుకబడే ఉంది. 1,086 స్కూళ్లలో 2,233 మంది టీచర్లతో 1.18 లక్షల మంది విద్యార్థులకు విద్య అందుతోంది. వీటికి అదనంగా ఐదు ఆదర్శ పాఠశాలలు, 18 కస్తూరిబా, బీసీ, ఎస్సీ, మైనార్టీ గురుకులాలు, 10 సర్కారు, 4 బీసీ, 9 సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో 149 ఆరోగ్య ఉపకేంద్రాలు, 17ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 అర్బన్, 3 సామాజిక కేంద్రాలు ఉన్నాయి. 4 బస్తీ, 100 పల్లె దవాఖానాలు, 9 ఆరోగ్య మహిళా కేంద్రాలు, అందుబాటులోకి వచ్చాయి. మాతాశిశు సంరక్షణ, జిల్లా ఆసుపత్రి అప్‌గ్రేడ్, మెడికల్, నర్సింగ్ కాలేజీలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలకు టీహబ్ వంటి సౌకర్యాలు మెరుగయ్యాయి.

సాగు నీరందితేనే...
జిల్లాలో ఇప్పటికీ సరైన సాగునీటి వసతులు లేవు. చిన్న, మధ్యతరహా, చెరువులు, వర్షాధారం, బోర్లు, బావుల ఆధారంగానే పంటలు సాగవుతున్నాయి. ప్రాణహిత, గోదావరి నీటిని జిల్లా భూములకు మళ్లించాల్సిన అవసరం ఉంది. మరోవైపు స్వరాష్ట్రంలో జిల్లాలో సాగు విస్తీర్ణం పెరిగింది. పత్తి, వరితోపాటు ఆయిల్‌పామ్ పంటలు సాగవుతున్నాయి. ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. ఈ సీజన్ వరకు 3.42 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి.

మెరుగుపడుతున్న గ్రామాలు
ఉమ్మడి రాష్ట్రంలో అనేక గ్రామాలకు కనీస రోడ్లు లేకుండా ఉండేవి. గడిచిన పదేళ్లలో అన్ని గ్రామాలకు రహదారులు వచ్చాయి. జిల్లాలో రహదారుల అభివృద్ధి పరిశీలిస్తే, రోడ్డు భవనాల శాఖ పరిధిలో 635 కి.మీ, పంచాయతీరాజ్ పరిధిలో 1943 కి.మీ మేర విస్తరించాయి. వీటితోపాటు జిల్లా నుంచి జాతీయ రహదారులు ఎన్‌హెచ్ 63, 363, ఎన్‌హెచ్ 163జీ, గడ్చిరోలి, నయా రాయ్‌పూర్ వంటి కొత్త జాతీయ రహదారులకు మోక్షం కలిగింది. ఇంకా కొన్నిచోట్ల అన్ని కాలాల్లో వెళ్లేలా అటవీ అనుమతుల రాక ఇబ్బంది పడాల్సి వస్తోంది.

సంక్షేమం దిశగా
జిల్లాలో ఏటా సంక్షేమ లబ్ధిదారులు పెరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పలురకాలు పథకాలతో ఊరట దక్కుతోంది. జిల్లాలో 893 అంగన్‌వాడీ కేంద్రాలు వచ్చాయి. 2.03 లక్షల మంది రేషన్ కార్డులతో ప్రతీ నెలా 3 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అందుతోంది. 2,403 మందికి 5,024 ఎకరాల పోడు భూ ములకు పట్టాలు, విద్యుత్ కనెక్షన్లు పెరిగా యి. పదేళ్లతో పోలిస్తే విద్యుత్ డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం 3.45 విద్యుత్ కనెక్షన్లకు చేరింది. జిల్లాలో 688 మెగా వాట్ల విద్యుత్ వినియోగం పెరిగింది. గృహ, వ్యాపార సంబంధ వినియోగం అధికంగా ఉంది. జిల్లాలో 16 మండలాల్లో మహిళా సంఘాల, స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ మెరుగయ్యాయి. చేయూత కోసం10,162 సంఘాలు ఏర్పాటు అయ్యాయి. గతేడాది వరకు రూ.358 కోట్ల ప్రగతి సాధించారు. గడిచిన పదేళ్లలో ఈ వృద్ధి రెండింతలు దాటింది. ఆసరా ఫించన్లు పెరిగాయి.

చేరువైన పాలన..
ఉమ్మడి రాష్ట్రంలో ఆదిలాబాద్ కేంద్రంగా పాలన సాగింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో జిల్లా పరిషత్, కొత్త మండలాల్లో మండల పరిషత్‌లు, కొత్త పంచాయతీలు, మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. స్థానిక ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగింది. జిల్లాస్థాయి అధికార యంత్రాంగం అందుబాటులో ఉంటూ పాలన సాగిస్తోంది.

బరిగీసి కొట్లాడి..
- తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాలు
- స్వరాష్ట్రం కోసం పోరాటాలు

సాక్షిప్రతినిధి, మంచిర్యాల: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జిల్లా వాసులు ప్రముఖ పాత్ర పోషించారు. స్వరాష్ట్రం కోసం ఏకమై ముందుకు సాగారు. ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమానికి గ్రామాలు, పట్టణాలు ఊపిరులూదాయి. ఉద్యోగుల సకల జనుల సమ్మె, ఉద్యమబాట, తెలంగాణ బిల్లు పార్లమెంట్ ప్రవేశం, ఆమోదం, ఆత్మహత్యలు, రాష్ట్ర రాజధానిలో జరుగుతున్న నిరసనలకు మద్దతుగా జిల్లా ప్రజలు కదంతొక్కారు. సింగరేణి కార్మికులు విధులకు దూరంగా ఉంటూ నిరసనలు తెలిపారు. ఉద్యమ సమయంలో విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిర్బంధాలకు ఎదురొడ్డి పోరాడారు. ప్రభుత్వ, ప్రైవేటురంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులతోపాటు మహిళా, విద్యార్థులు జిల్లా నుంచి నిరసనల్లో పాల్గొన్నారు.



కార్మికులతో నిరసనలో కోదండరామ్(ఫైల్)



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కార్మికులు(ఫైల్)

కదంతొక్కిన సింగరేణి కార్మికులు..
సకల జనుల సమ్మె పిలుపులో భాగంగా సింగరేణిలో కార్యకలాపాలు స్తంభించాయి. జిల్లాలో ఉన్న శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరి యాల్లో కార్మికులు విధులు బహిష్కరించి నిరసనల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. తమ జీతం కోత పడినా రోజుల తరబడి బాయిల్లోకి దిగకుండా తమ నిరసన గళాన్ని తెలియజేశారు. జేఏసీ చైర్మన్ కోదండరామ్, రాష్ట్ర నాయకులు పలు మార్లు ఇక్కడికి వచ్చారు. గద్దర్‌తోపాటు పలు వురు గాయకులు ఇక్కడి సభల్లో పాల్గొన్నారు. కళాకారులు ధూంధాంలతో కదం తొక్కారు. స్థానిక కళాకారులు గజ్జె కట్టి ఆడిపాడారు.

సుజలాం.. సుఫలాం..
- పదేళ్లలో జిల్లాలో పెరిగిన జలం
- విస్తరించిన పంటల సాగు..
- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ



కోట శివకృష్ణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్, కేవీకే బెల్లంపల్లి

బెల్లంపల్లి: తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత గడిచిన పదేళ్లలో జిల్లా వ్యవసాయరంగం గణనీయంగా వృద్ధి చెందింది. సాగునీటి ప్రాజెక్టులతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. పంటల సాగులో కూడా జిల్లా రైతులు నూతన పద్ధతులను ఆకలింపు చేసుకుని పంటలు పండిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ తెలిపారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పదేళ్లలో జిల్లా వ్యవసాయరంగంలో వచ్చిన మార్పులపై 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

సాక్షి: పదేళ్ల కాలంలో జిల్లా వ్యవసాయరంగంలో వచ్చిన మార్పులేంటి?

కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ : జిల్లాలో వరి, పత్తి ప్రధాన పంటలు. స్వరాష్ట్రం ఏర్పడ్డాక సాగునీటి ప్రాజెక్టులు నిర్మాణం జరగడం, చెరువులకు మరమ్మతులు చేపట్టడంతో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. మేలైన దిగుబడిని ఇచ్చే వంగడాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. వ్యవసాయ యాంత్రీకరణ పెరిగింది.

సాక్షి: పెరిగిన సాగువిస్తీర్ణం ఎంత ?

కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మొదట్లో జిల్లాలో సాగు విస్తీర్ణం 2.30 లక్షల ఎకరాలు ఉంది. 2023 వానాకాలం నాటికి సాగు విస్తీర్ణం 3.40 లక్షల ఎకరాలకు పెరిగింది. సుమారు 32 శాతం సాగు విస్తీర్ణం పెరిగింది. యాసంగి సాగు విస్తీర్ణం కూడా 45 వేల ఎకరాల నుంచి 1.10 లక్షల ఎకరాలకు పెరిగింది. పెరుగుదల శాతం 59గా నమోదైంది.

సాక్షి: వ్యవసాయ అనుబంధరంగాల పరిస్థితి ఎలా ఉంది?

కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ : వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉద్యాన రంగం పురోభివృద్ధిలో ఉంది. ఈరంగంలో కూరగాయల సాగు, పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెరిగింది. జిల్లాలో 16 వేల పైచిలుకు ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉండగా నూతన సాంకేతికతను ఉపయోగించుకుని ఫలసాయాన్ని దూరప్రాంతాలకు ఎగుమతి చేస్తూ ఆదాయం గడిస్తున్నారు. టమాటా, బీర సాగులో ట్రెల్లిస్, పందిరి సాగు పద్ధతులను అవలంబించి అధిక దిగుబడి సాధిస్తున్నారు. పౌల్ట్రీ, డెయిరీ, మత్స్య తదితర రంగాలు ఇంకా వృద్ధిలోకి రావాల్సి ఉంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచడానికి చర్యలు చేపట్టారు. జిల్లాలోనూ ఆ పంటను పరిచయం చేయడం జరిగింది. డ్రాగన్ ఫ్రూట్, అవకాడో సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

సాక్షి: కొత్త పనిముట్ల పరిచయం ఏమేరకు జరిగింది.?

కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్: మారుతున్న వ్యవసాయ విధానాలు, వ్యవసాయ రంగంలో ఎప్పటి కప్పుడు వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా కూలీల కొరతను అధిగమించడానికి వ్యవసాయ పనిముట్లు అందుబాటులోకి వచ్చాయి. భారీ పనిముట్లను రైతు సహకార సంఘాల ద్వారా రైతులకు అద్దెకు ఇస్తూ సాగు వ్యయాన్ని, సమయాన్ని తగ్గిస్తున్నారు. ఈ క్రమంలోనే డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ రైతులకు అందుబాటులోకి వచ్చింది.

సాక్షి: వరి సాగు పెరగానికి కారణం ఏమిటి?

కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ : వరి సాగు పురాతనంగా వస్తున్న నాటు పద్ధతిలోపాటు నేరుగా వెదజల్లడం, స్వల్ప కాలిక మేలైన వంగడాలు, నాణ్యమైన విత్తన లభ్యత, యాంత్రీకరణ, పనిముట్లు అందుబాటులోకి రావడం, పంట ఉత్పత్తులకు మద్దతు ధర లభించడం, మార్కెట్ సౌలభ్యం అందుబాటులో ఉండటం వంటి అంశాలు వరి సాగు పెరగడానికి దోహద పడ్డాయి. ప్రకృతి కల్పిస్తున్న అవరోధాలతో అడపాదడపా రైతులు నష్టాలు కూడా చవిచూస్తున్నారు.

కంపోస్టు ఎరువు తయారు చేయాలి
- డీపీవో వెంకటేశ్వర్‌రావు



దంపింగ్‌యార్డు పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

కాసిపేట: గ్రామాల్లో కంపోస్టు ఎరువు తయారీ ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని, తయారు చేసిన ఎరువును నర్సరీలు, పల్లె ప్రకృతి వనంలోని మొక్కలకు వేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. మండలంలోని దేవాపూర్, ముత్యంపల్లి, కాసిపేట గ్రామపంచాయతీలను శనివారం సందర్శించి కంపోస్ట్ పిట్‌లో కంపోస్ట్ ఎరువుల తయారీని పరిశీలించారు. పిట్‌లో వానపాములు బతికి ఉండేలా చూడాలన్నారు. మిగులు ఎరువును విక్రయించి డబ్బులను గ్రామపంచాయతీ సాధారణ నిధిలో జమచేయాలని కార్యదర్శులకు సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి రోడ్లపై చెత్త, ప్లాస్టిక్ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతీరోజు రోడ్లు, మురికి కాలువలు శుభ్రం చేయించడం, ట్రాక్టర్ ద్వారా ఇంటింటికీ చెత్త సేకరణ లాంటి కార్యక్రమాలు చేపడుతూ పంచాయతీలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పల్లె ప్రకృతివనాలు, క్రీడాప్రాంగణాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో కొంక నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు మేఘన, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల్లో జాప్యం చేయొద్దు
- టీఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న



సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న

జన్నారం: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న డిమాండ్ చేశారు. జన్నారం ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడారు. ఏళ్లుగా బదిలీలు, పదోన్నతులు లేకపోవడంతో ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో బదిలీలు అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. తొమ్మిదేళ్లుగా రేషనలైజేషన్ ప్రక్రియ లేకపోవడంతో చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తి అస్తవ్యస్తంగా మారిందని పేర్కొన్నారు. విద్యార్థులు లేని పాఠశాలల ఉపాధ్యాయులను, ఎక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలకు పంపాలని సూచించారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయ నియామకాలు పూర్తయ్యే వరకు విద్యావలంటీర్లను నియమించాలన్నారు. పారిశుధ్య నిర్వహణకు స్కావెంజర్లను నియమించాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్టీలను రెగ్యులర్ చేయాలని, విద్యార్థులకు రెండు జతల టై, బెల్టు, బూట్లను, స్కూల్ బ్యాగులు ప్రభుత్వమే అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాంటెంకి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

చివరి ధాన్యపు గింజ వరకు కొనుగోలు చేస్తాం
- అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి చివరి ధాన్యపు గింజ వరకు కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ మోతీలాల్ తెలిపారు. జిల్లాలో 286 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 21,955 మంది రైతుల నుంచి 1,43,210 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం జరిగిందన్నారు. వీటికి రూ.204.3 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఇప్పటి వరకు 1,40,499 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించామని పేర్కొన్నారు. 1,12,253 మెట్రిక్ టన్నుల ధాన్యం, 18,900 మంది రైతుల వివరాలు ట్యాబ్‌లలో నమోదు చేయడం జరిగిందని వెల్లడించారు.

4న ధ్రువీకరణ పత్రాలతో రావాలి
మంచిర్యాలటౌన్: డీఎస్సీకి దరఖాస్తు చేసుకుని స్టడీ మెటీరియల్/బుక్ ఫండ్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థులు ఈనెల 4న సర్టిఫికెట్లతో సంప్రదించాలని బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బి.వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూరులోని కలెక్టరేట్‌లోని రూమ్ నంబర్ 5లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు హాజరు కావాలని పేర్కొన్నారు. హాజరయ్యే అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్ బుక్ ఫండ్ దరఖాస్తు ఫారం, ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ మెమోలు, డీఈడీ/బీఈడీ మెమో, టీఈటీ మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్సు, డీఎస్సీ దరఖాస్తు నంబర్, అభ్యర్థి బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్‌తో హాజరు కావాలని సూచించారు.

న్యూస్‌రీల్

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు
- కౌంటింగ్ పరిశీలకురాలు విజయ ఈ.రవికుమార్



లెక్కింపు గదిని పరిశీలిస్తున్న పరిశీలకురాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ పకడ్బందీగా చేపడతామని కౌంటింగ్ పరిశీలకురాలు విజయ ఈ.రవికుమార్ తెలిపారు. ఉదయం జిల్లాకు వచ్చిన ఆమెను కలెక్టర్ బి.సంతోష్, డీసీపీ అశోక్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ముల్కల్ల గ్రామ శివారులోని ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సంతోష్‌తో కలిసి శనివారం పరిశీలించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. లెక్కింపు, భద్రత ఏర్పాట్లు నిరంతరం సీసీ కెమెరాలో పర్యవేక్షణ ఉంటుందన్నారు. లెక్కింపు గదులు, రౌండ్ల వారీగా ఏర్పాట్లు చేసిన టేబుళ్లు, విద్యుత్, ఇంటర్‌నెట్, మంచినీటి వ్యవస్థలను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. వారివెంట అదనపు కలెక్టర్లు మోతీలాల్, రాహుల్, డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ ప్రకాశ్, చెన్నూర్ ఏఆర్వో చంద్రకళ, ఆర్డీవో రాములు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్ ఉన్నారు.

ఉద్యోగాలు భర్తీ చేయాలి
పాతమంచిర్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆరిగెల మహేశ్ కోరారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మోదీ యువతను మోసం చేశారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని కోరారు. అన్ని శాఖల్లో ఖాళీలు భర్తీ చేయాలన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు దేవదాస్, కమిటీ సభ్యులు శేఖర్, ప్రేంకుమార్ పాల్గొన్నారు.

తెరుచుకున్న సర్కారు పాఠశాలలు
- ఉపాధ్యాయులు, విద్యార్థుల రాకతో సందడి
- రేపటి నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు..
- జూన్ 3 నుంచి బడిబాట..



హాల్‌టికెట్లు, టీసీల కోసం వచ్చిన విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల వివరాలు

పాఠశాలలు	సంఖ్య	విద్యార్థుల వివరాలు
ప్రాథమిక	510	14,256
యూపీఎస్	96	4,666
ఉన్నత	108	26,608
మొత్తం	714	45,530

మంచిర్యాలఅర్బన్: వేసవి సెలవుల అనంతరం సర్కారు పాఠశాలలు శనివారం తెరుచుకున్నాయి. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్స వేడుకల నేపథ్యంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు బడిబాట పట్టారు. జెండా ఆవిష్కరణ, 3 నుంచి నిర్వహించే బడిబాట సన్నద్ధతపై చర్చించారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదుల శుభ్రం చేయించారు. సోమవారం నుంచి నిర్వహించే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నేపథ్యంలో హాల్‌టికెట్లు జారీ చేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆన్‌లైన్ మెమోలు, టీసీలు ఇచ్చారు.

బడిబాట పట్టేలా..
బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలనే లక్ష్యంతో ఏటా నిర్వహిస్తున్నట్లుగానే ఈసారీ పాఠశాలల పునఃప్రారంభానికి ముందు బడిబాట కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సోమవారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించనున్నారు. తమ విద్యాలయాలు సాధించిన విజయాలు, బోధనా వసతులను తల్లిదండ్రులకు వివరించి పిల్లలకు ప్రవేశాలు కల్పించనున్నారు. రోజుకో ప్రత్యేకతతో జూన్ 3 నుంచి 19 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తారు. తల్లిదండ్రుల్లో చైతన్యం కల్పించి ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పాఠశాలల్లో 1వ తరగతిలో, 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 6వ తరగతిలో చేర్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

లక్ష్యాలు ఇలా..
జూన్ 3న బడిబాట కార్యక్రమంలో ర్యాలీ నిర్వహించనున్నారు. 4న ఇంటింటికీ తిరిగి బడి ఈడు పిల్లలను గుర్తించి జాబితా తయారు చేయాలి. 5 నుంచి 10వ తేదీ వరకు పాఠశాలల పరిధిలోని పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడం. అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు పైబడిన వారిని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయించాలి. బాల కార్మికులను గుర్తించి వారిని చదువుకునేలా చేయాలి. పుస్తకాలు ఏకరూప దుస్తులు సిద్ధంగా ఉంచుకోవాలి. 11న తరగతి గదులను శుభ్రం చేయడం, మంచినీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. గ్రామ సభ నిర్వహించి బడిబాట ఫలితాలపై చర్చించాలి. 12న పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా బడి తెరిచి తల్లిదండ్రులను పిలిచి సమావేశం కావాలి. 13న విద్యార్థులందరినీ బడికి రప్పించటం, 14న సామూహిక విద్యాభ్యాస్యం నిర్వహించటం తదితర క్యాక్రమాలు నిర్వహించాలి. 15న సమగ్ర విద్యా దినోత్సవం, బాలికావిద్యపై అవగాహన కల్పించాలి. 18న మొక్కల పెంపకం దినోత్సవం, తరగతి గదుల డిజిటలీకరణపై అవగాహన, 19న క్రీడా దినోత్సవం నిర్వహించాలి.

'దశాబ్ది' వేడుకలకు సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బి. సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ రాష్ట్ర పదో ఆవిర్భావ వేడుకల నిర్వహణకు సమీకృత కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో అదనపు కలెక్టర్ రాహుల్, డీసీపీ అశోక్‌కుమార్‌తో కలిసి వేడుకల ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి జూన్ 6వ తేదీ వరకు అమలులో ఉన్నందున భారత ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి, ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్, కలెక్టరేట్ సి విభాగం పర్యవేక్షకులు సంతోష్ పాల్గొన్నారు.

వేడుకల షెడ్యూల్..
ఆదివారం ఉదయం 8:30 గంటలకు తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పూలమాలాంకరణ, 8:40 గంటలకు తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పమాల సమర్పణ ఉంటుంది. నస్పూరులోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో 8:55 గంటలకు గౌరవ వందనం, 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, 9:05 గంటలకు సందేశం ఉంటాయి.

8న బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు
మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న మంచిర్యాల పట్టణంలోని రంగంపేట్ గ్రీన్‌సిటీలో మాస్టర్ బ్యాడ్మింటన్ అకాడమీ(రూబీ)లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు ఎడ్ల మహేశ్, పుల్లూరి సుధాకర్ తెలిపారు. అండర్ 11, అండర్ 13, అండర్ 15, అండర్ 17, అండర్ 19 బాల బాలికలకు, సీనియర్స్ మెన్స్, ఉమెన్, మాస్టర్స్ 35 ప్లస్ నుంచి 75 ప్లస్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని వివరించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 6వ తేదీ సాయంత్రం వరకు 9885282233, 9959977929 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై దాడులు



నాటుసారాతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

నెన్నెల: మండలంలోని ఆవుడం గ్రామ శివారులో గుడుంబా స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సై లచ్చన్న తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గుడుంబా స్థావరంపై దాడిచేసి వెయ్యి లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 11 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారు చేస్తున్న ముప్పిడి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వడదెబ్బతో వృద్ధురాలు మృతి



మాటేటి లక్ష్మి(ఫైల్)

భీమారం: మండల కేంద్రానికి చెందిన మాటేటి లక్ష్మి(80) శుక్రవారం రాత్రి వడదెబ్బతో మృతి చెందింది. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఒక్కసారిగా కింద పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108లో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది.

భీమారం: మండల కేంద్రంలోని ఇప్పల బొగుడ వద్ద అర్కిల సంపత్ (45) శనివారం వడదెబ్బతో మృతి చెందినట్లు ఎస్సై బి.రాములు తెలిపారు. శ్రీరాంపూర్‌కు చెందిన సంపత్ భీమారంలో ఉన్న అతని స్నేహితుడైన మదుసూధన్ దగ్గరకి వచ్చాడు. అలసటగా ఉందని చెప్పి పంక్చర్ షాపు పక్కనే పడుకుని మృతి చెందాడు.

చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: చెక్ బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్షతో పాటు అప్పుగా తీసుకున్న డబ్బును వడ్డీతో కలిపి చెల్లించాలని స్థానిక న్యాయమూర్తి కే.నిరోష తీర్పునిచ్చారు. గౌతమినగర్‌కు చెందిన బిల్ల మల్లయ్య, 2015లో అదే కాలనీకి చెందిన అజ్మీర రాజేశ్‌పై రూ.28.50 లక్షల చెక్ బౌన్స్ కేసు వేశాడు. నేరం రుజువుకావడంతో నిందితుడికి ఏడాది జైలుశిక్ష, చెక్‌డబ్బులతో పాటు అదనంగా రూ.25 వేలు కలిపి మల్లయ్యకు చెల్లించాలని తీర్పును వెల్లడించారు.

భార్య కాపురానికి రావడం లేదని బలవన్మరణం



వెంకటేశ్ (ఫైల్)

మంచిర్యాల రూరల్ (హాజీపూర్): భార్య కాపురానికి రావడం లేదని ఒకరు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల మేరకు హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన ఎంబడి వెంకటేష్ (35)కు నంనూర్ గ్రామానికి చెందిన జ్యోతితో ఆరేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటేష్ ఇటీవల మద్యానికి బానిస కావడంతో ఇంట్లో తరచూ గొడవలు జరిగా యి. దీంతో జ్యోతి ఇటీవల పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుని సోదరుడు అంజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



ఉమ్మడి జిల్లాలో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల ఖాళీల వివరాలు

జిల్లా	స్కూల్ అసిస్టెంట్	లాంగ్వేజ్ పండిట్	పీఈటీ	ఎస్జీటీ	స్కూల్ అసిస్టెంట్ (ప్రత్యేక)	ఎస్జీటీ (ప్రత్యేక)	మొత్తం
నిర్మల్	70	04	04	236	05	23	342
ఆదిలాబాద్	74	14	02	209	06	19	324
మంచిర్యాల	70	16	03	176	05	18	288
కుమురంభీం	62	25	02	234	03	15	341

సర్దుబాటు చదువులేనా..?

- విద్యావలంటీర్ల ఊసే లేనివైనం
- పది రోజుల్లో పాఠశాలలు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏటా కోట్లాది రూపాయలతో మధ్యాహ్నం భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఇదంతా బాగానే ఉన్నా ఉపాధ్యాయ ఖాళీల భర్తీ విషయంలో స్పష్టత కొరవడుతోంది. ఏళ్ల తరబడి ఖాళీలు భర్తీ కాక గందరగోళంగా మారుతోంది. ఈ ఏడాది మరో పదిరోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం గతేడాది మాదిరిగానే ఉపాధ్యాయులను డిప్యూటేషన్ చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో మంచిర్యాల జిల్లాలో 136 మంది ఉపాధ్యాయులకు వర్క్ అడ్జస్ట్ పేరిట విధులు కేటాయించి సర్దుబాటు చేసింది. ఇంతవరకు రిలీవ్ చేయలేదు. మరోసారి టీచర్ల సర్దుబాటుతోనే చదువులు తప్పేలా లేదు.

ఖాళీల మాటేమిటో..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చదువులపై ప్రభావం చూపకుండా ఏటా టీచర్ల సర్దుబాటు చేస్తున్నారు. ఎస్‌ఏల బదిలీలు అయినా రిలీవ్ కాకపోవడం.. పీజీహెచ్ఎంలుగా పదోన్నతులు పొంది వెళ్లిపోయిన స్థానంలో ఖాళీలు మిగిలిపోయాయి. వివిధ కారణాలతో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి. జిల్లాలో బయోసైన్స్, సోషల్, హిందీ టీచర్ల కొరత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఖాళీలు ఎక్కువగా ఉండగా 136 మంది ఉపాధ్యాయులను తాత్కాలికంగా సర్దుబాటు చేస్తే మిగిలిన ఖాళీలపై తేల్చాల్సి ఉంది.

వీవీల ఊసేది..

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో విద్యావలంటీర్ల (వీవీ) నియామకం ఉంటుందా అనే చర్చ సాగుతోంది. 2019–20 విద్యా సంవత్సరంలో చివరిసారిగా జిల్లాలో విద్యావలంటీర్లు సేవలందించారు. తర్వాత కరోనాతో రెండేళ్లు మూతబడడం... ఆతర్వాత కాలంలో ప్రభుత్వం వారి నియామకంపై దృష్టి సారించలేదు. గతంలో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో కొన్నిచోట్ల ఒకరి నుంచి ఇద్దరు ఉపాధ్యాయులతో సర్దుబాటు చేశారు. 89 ఏకోపాధ్యాయ పాఠశాలల్లో వీవీలు లేకపోవడంతో టీచర్లు పడుతున్న బాధలు వర్ణనాతీతం. దీంతో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న పాఠశాలల్లో సరైన బోధన లేక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. దీని ప్రభావం ఫలితాలపై పడుతోంది. ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసే వరకు వీవీలను నియమించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చదువుకు ఆటంకం లేకుండా చర్యలు

విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా చర్యలు చేపడుతాం. గతేడాది వర్క్‌అడ్జస్ట్‌మెంట్ కింద ఆయా పాఠశాలలకు కేటాయించిన టీచర్లను రిలీవ్ చేయలేదు. వీవీల నియామకంపై ప్రభుత్వం నుంచి ఇంకా ఉత్తర్వులు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే వాటి ప్రకారం చర్యలు చేపడుతాం.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

కాసిపేట 1గనిపై అవగాహన సమావేశం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

కాసిపేట: మందమర్రి ఏరియాలోని కాసిపేట 1గనిపై శనివారం ఫ్యాటల్ ఫ్రీ జూన్ 2024 ప్రత్యేక భద్రత అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్షణ అధికారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ కార్మికుడు చేసే పనివలన తనతో పాటు తోటి ఉద్యోగులకు సైతం ఎలాంటి ప్రమాదం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ మాట్లాడుతు రక్షణ లేని బొగ్గు ఉత్పత్తి ముఖ్యం కాదని కార్మికుల రక్షణ, శ్రేయస్సు ధ్యేయమన్నారు. ఉత్పత్తి పేరిట అధికారులు కార్మికులను వేధిస్తే ఊరుకునేది లేదని, ఏఐటీయూసీ కార్మికులకు అండగా ఉంటుందన్నారు. డెప్యూటీ మేనేజర్లు నిఖిల్, వెంకటేశ్వర్లు, ఇంజనీర్ మధుకర్, అండర్ మేనేజర్ సుమన్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, హెడ్‌ఓవర్‌మెన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

నస్పూర్: ఉద్యోగులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి సూచించారు. శనివారం ఫాటల్ ఫ్రీ జూన్ 2024 ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆర్కే 7 గనిపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 30 వరకు ప్రత్యేక భద్రత అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కే 7 గ్రూపు ఏజెంట్ రాముడు, గని మేనేజర్ ఎస్.శ్రీధర్, అధికారులు అమర్నాథ్ రెడ్డి, రవిశంకర్‌వత్స, ప్రవీణ్‌కుమార్, జగదీశ్వర్ రావు, రవీందర్, సంతన్ పాల్గొన్నారు.

‘గెలిచిన సంఘాల గుర్తింపు రద్దుచేయాలి’



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణి గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు గెలిచి ఆరు నెలలు కావస్తున్నా గుర్తింపు పత్రాలు పొందలేదని, వాటిని రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు బడికెల సంపత్, ఓ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం గుర్తింపు ఇవ్వడం లేదని గెలిచిన యూనియన్లు కాలయాపన చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, సీఎల్‌సీ జోక్యం చేసుకోవాలని సూచించారు. గుర్తింపు పత్రాలు పొందకపోవడం వలన యాజమాన్యం కార్మిక సమస్యలపై ఎలాంటి నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించడం లేదని, దీంతో కార్మిక సమస్యలు పేరుకుపోతున్నాయన్నారు. సింగరేణి నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు అన్ని కార్మిక సంఘాలను ఆహ్వానించాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, టీబీజీకేఎస్ నాయకులు వీరారెడ్డి, రాంచందర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ సమావేశం బహిష్కరణ



సమావేశాన్ని బహిష్కరించిన కార్మికులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో యాజమాన్యం నిర్వహించిన సేఫ్టీ సమావేశాన్ని శనివారం ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు బహిష్కరించారు. డీజీఎం వైఖరికి నిరసనగా సమావేశాన్ని బహిష్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ పిట్ సెక్రటరీ లతీఫ్ మాట్లాడుతూ కార్మికులతో డీజీఎం అనుచితంగా వ్యవహరిస్తున్నాడని, కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా నిరంకుశంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. డ్రైవర్లకు ప్రమోషన్ ఇవ్వకుండా మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. సమావేశంలో ఆ యూనియన్ నాయకులు తిరుపతిరెడ్డి, ఆర్కాల శ్రీనివాస్, గుండా సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

భార్యను గొడ్డలితో కొట్టిచంపిన భర్త

- నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి



మరోని మృతదేహం

కాసిపేట: క్షణికావేశంలో భార్యను గొడ్డలితో కొట్టిచంపిన సంఘటన మండలంలోని మామిడిగూడలో చోటు చేసుకుంది. శనివారం మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మామిడిగూడకు చెందిన నగావత్ దేలు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతని భార్య నగావత్ మరోని (60)తో తరచూ గొడవపడేవాడు. గత నెల 31న రాత్రి మద్యం మత్తులో ఆమెతో గొడవకు దిగాడు. క్షణికావేశంలో గొడ్డలితో కొట్టడంతో ప్రాణాలు కోల్పోయింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

ఉత్తమ ఉద్యోగుల ఎంపిక



కోజా వెంకటరాము



సిదిరాల మల్లారావు



సంతోష్



శేఖర్

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఉత్తమ అధికారిగా ఎన్నికైన కోజా వెంకటరాము (డీవైఎస్ఈ, ఆర్కే 7)ను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలో నేడు నిర్వహించనున్న వేడుకల్లో సన్మానించనున్నట్లు సంస్థ యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఏరియా ఉత్తమ ఉద్యోగిగా ఎన్నికైన సిదిరాల మల్లారావు (జనరల్ మజ్దూర్, ఆర్కే 5) ను శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో నిర్వహించనున్న వేడుకల్లో సన్మానించనున్నట్లు యాజమాన్యం పేర్కొంది.

కాసిపేట: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని మందమర్రి ఏరియా కాసిపేట గనికి చెందిన కోల్‌కట్టర్ కార్మికుడు కె.సంతోష్‌ను ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక చేసినట్లు సింగరేణి అధికారులు శనివారం ప్రకటించారు. ఆదివారం మందమర్రిలో నిర్వహించనున్న వేడుకల్లో జీఎం మనోహర్ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకోనున్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ ఓసీలో పనిచేస్తున్న సీనియర్ సర్వే ఆఫీసర్ మన్నెపల్లి శేఖర్‌ను ఉత్తమ సింగరేణియన్‌గా ఎంపిక చేశారు. ఆదివారం కొత్తగూడెంలో సీఎండీ బలరాం చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకోనున్నారు.

అటవీ అధికారుల అడ్డగింత

కాగజ్‌నగర్ రూరల్: అంకుసాపూర్ గ్రామ శివారులోని పోడు భూములను శనివారం సర్వే చేసేందుకు వెళ్లిన అటవీశాఖ అధికారులను పోడు రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో రమాదేవి మాట్లాడుతూ పోడు భూములకు సంబంధించిన పట్టాల విషయంలో సర్వే చేస్తున్నామని, పోడు రైతులు సహకరించాలని కోరారు. పలువురు రైతులు మాట్లాడుతూ భూములకు సంబంధించి తమ వద్ద పట్టాలు ఉన్నాయని, రెవెన్యూ అధికారులు సర్వేలు చేసి పట్టాలు ఇచ్చినట్లు వివరించారు.

అగ్నిప్రమాదంలో మామిడి చెట్లు దగ్ధం



కాలిన మామిడి చెట్లు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లిలో కుదిర సందీప్‌కు చెందిన దాదాపు 65 మామిడి చెట్లు దగ్ధమైనట్లు బాధితుడు తెలిపాడు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మామిడి చెట్లు కాలిపోయాయని బాధితుడు వాపోయాడు. నిందితులపై చర్యలకు తాళ్లగురిజాల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

అస్తిత్వం దక్కింది... ఆశలే నెరవేరాలి

- రాష్ట్ర సాధనలో సింగరేణి పాత్ర అజరామరం
- నిధులు పెరిగాయి..నియామకాలు రావాలి
- డిపెండెంట్ ఉద్యోగాల హక్కు పునరుద్ధరణ



గోషిక మల్లేశ్, సింగరేణి ఉద్యోగి, జేఏసీ కన్వీనర్

శ్రీరాంపూర్: తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికుల పాత్ర అజరామరం... ఎన్నో కార్మికోద్యమాలకు పురిటిగడ్డ అయిన సింగరేణి తెలంగాణ సాధన కోసం జరిగిన మహోద్యమానికి మరింత ఆయువునిచ్చింది. సకల జనుల సమ్మె కంటే ముందే కార్మికులు తెలంగాణ కోసం సమ్మెలు చేసిన చరిత్ర ఉంది. బొగ్గు బాయిలను బంద్ చేసి బొగ్గు పెళ్లను కూడా బయటికి రాకుండా దక్షిణాదిన కరెంట్ లేకుండా చేసి ఢిల్లీకి ఉద్యమ సెగ చూపించారు. సాక్షాత్తూ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ నోట సింగరేణి ఉద్యమ ప్రస్తావన వచ్చింది. ఎన్నో త్యాగాలతో తెలంగాణ సాధించుకుని నేటికి పదేళ్లు అవుతోంది. పదేళ్లకు ముందు, తర్వాత సింగరేణిలో భారీ మార్పులు వచ్చాయని నాటి సింగరేణి ఉద్యోగి, జేఏసీ కన్వీనర్ గోషిక మల్లేశ్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆయనతో ‘సాక్షి’ ఇంటర్వ్యూ...

ప్రశ్న: పదేళ్లలో కార్మికులకు ఒనగూరింది ఏమిటి?

జవాబు: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత సింగరేణిలో అనేక మార్పులు వచ్చాయి. సింగరేణి సొంత అస్తిత్వంతో మనుగడ సాధిస్తోంది. ఉద్యోగాల్లో స్థానికులకే అవకాశం కల్పిస్తున్నారు. ముఖ్యంగా బంద్ అయిన డిపెండెంట్ ఉద్యోగాలు కారుణ్య ఉద్యోగాల పేరుతో తిరిగి ఇప్పించడం గొప్ప మైలురాయిగా చెప్పవచ్చు. ఇందులో కొంత అవినీతిని రూపు మాపాల్సిన అవసరమైతే ఉంది. ఉద్యోగులకు తెలంగాణ స్పెషల్ ఇంక్రిమెంట్, విద్యుత్‌చార్జీల మాఫీ, సొంతింటికి రూ.10 లక్షల వడ్డీ రీయింబర్స్‌మెంట్, ఇంకా అనేక హక్కులు, సదుపాయాలు ఈ పదేళ్లలో వచ్చాయి. నాడు కార్మికులు ఏదేని ప్రమాదంలో చనిపోతే నష్టపరిహారాల కోసం మృతదేహాలతో ధర్నాలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు సంస్థ రూ.కోటి వరకు పరిహారం అందిస్తూ కార్మికుని కుటుంబానికి అండగా నిలబడుతోంది.

ప్రశ్న: ఓసీపీలతో అనర్థమే జరుగుతోంది కదా?

జవాబు: ఓసీపీలు బంద్ పెట్టి భూగర్భ గనులే తవ్వాలనేది తెలంగాణ ఉద్యమంలో ప్రధాన డిమాండ్. కానీ దురదృష్టవశాత్తు తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడ్డ ప్రభుత్వాలు వీటిపై శ్రద్ధ పెట్టడం లేదు. ఉద్యోగాలకు నిలయాలైన భూగర్భగనులే తవ్వాలి. ఓసీపీలు పూర్తిగా బంద్ పెట్టాలి. అప్పుడే ఈ ప్రాంతంలో ఉద్యోగాలతో పాటు పర్యావరణానికి కూడా మేలు జరుగుతుంది.

ప్రశ్న: ఉమ్మడి రాష్ట్రంతో పోల్చితే నేడు సింగరేణిలో ఏం మారింది?

జవాబు: సింగరేణి అస్తిత్వం కాపాడుకున్నాం. ఆత్మగౌరవం పెరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో స్థానికేతరుల అధికార పెత్తనం ఎక్కువగా ఉండేది. ఇప్పుడు అదిపోయింది. నాడు ఆంధ్రలో ఏ విపత్తు వచ్చిన ఇక్కడి కార్మికుల జీతాలు కోత పెట్టి అక్కడికి నిధులు తరలించే వారు. షేప్ నిధులను నేటి పక్క రాష్ట్రానికి తరలించారు. ఉన్నత స్థానాల్లో తెలంగాణ అధికారులు వచ్చారు. సింగరేణి నిధులు నేడు ఈ ప్రాంతంలోనే ఖర్చు అవుతున్నాయి. ఎక్స్‌ట్రనల్ ఉద్యోగ నియామకాల్లో స్థానిక సింగరేణి జిల్లాల వారికే ప్రాధాన్యతనిస్తున్నారు.

ప్రశ్న: ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటికీ పరిష్కారం కాని డిమాండ్లు ఉన్నాయా?

జవాబు: ఉన్నాయి. ఐటీ మాఫీ చేయాలి. తెలంగాణ వస్తే అవుతుందనుకున్నాం. కానీ ఇప్పటికీ కాలేదు. ఉద్యోగుల సంఖ్య తగ్గింది. కొత్త భూగర్భ గనులు రావాల్సి ఉంది. ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం, మైనింగ్ యూనివర్సిటీ డిమాండ్ అలాగే ఉంది. జేఏసీ విజన్ డాక్యుమెంట్‌లో ఇవన్నీ పొందుపర్చి తెలంగాణ మొదటి గవర్నమెంట్‌కు ఇచ్చాం. తెలంగాణాలో ఇంకా కార్మికుల ఆశలు నెరవేరాల్సి ఉంది.

ప్రశ్న: పదేళ్లలో సింగరేణిలో రాజకీయ పరిస్థితులు ఎలా మారాయి?

జవాబు: ఉమ్మడి రాష్ట్రంలో సింగరేణి స్వతంత్ర సంస్థగా ఉండేది. ఇప్పుడు రాజకీయ జోక్యం పెరిగింది. పైరవీలు పెరిగాయి. ఇవి పోవాలి. సంస్థ భవిష్యత్తు దృష్ట్యా ఇలాంటి శుభ పరిణామాలు కావు.

అటవీశాఖలో డ్రిల్‌మార్చ్ ప్రారంభం



ఇందన్‌పల్లి రేంజ్‌లో డ్రిల్‌లో పాల్గొన్న ఎఫ్ఆర్వో

జన్నారం: అటవీశాఖ అధికారుల్లో ఆత్మస్థైర్యం నింపి ఆరోగ్య సమస్యలను దూరం చేసేందుకు నూతనంగా పరేడ్, డ్రిల్ కార్యక్రమం చేపట్టారు. టైగర్ ప్రాజెక్టు ఫీల్డ్ అధికారి, సీఎఫ్ శాంతారాం, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్ ఆదేశాల మేరకు శనివారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని అన్ని అటవీ డివిజన్ల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. ప్రతీనెల 1, 15వ తేదీలలో కార్యక్రమం నిర్వహించాలని ఎఫ్‌డీపీటీ ఆదేశాలు జారీ చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం జన్నారం అటవీ డివిజన్‌లోని ఇందన్‌పల్లి, జన్నారం, తాళ్లపేట్ రేంజ్‌లలో ఉదయం 8 నుంచి తొమ్మిది గంటల వరకు సెల్యూట్, డ్రిల్, పరేడ్, డ్రెస్‌కోడ్, తదితర అంశాలు నిర్వహించారు.

ఆదివాసీలపై యుద్ధం చేస్తున్న బీజేపీ

- విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నాయకుడు పినాకపాణి



మాట్లాడుతున్న పినాకపాణి

బెల్లంపల్లి: బహుళజాతి సంస్థలు, కార్పొరేట్ శక్తులకు ఖనిజ సంపదను కట్టబెట్టడానికి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దండకారణ్యంలో ఆదివాసీలపై ఆరులక్షల సైన్యంతో యుద్ధం సాగిస్తోందని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నాయకుడు పినాకపాణి ఆరోపించారు. ఆపరేషన్ కగార్ పేరుతో విప్లవోద్యమాన్ని అంతమొందించడం అసాధ్యమన్నారు. శనివారం సీపీఐ మావోయిస్టుపార్టీ కేంద్రకమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ ప్రథమ వర్ధంతిని పట్టణంలోని పద్మశాలి భవన్‌లో నిర్వహించారు. విప్లవ రచయితలు, ప్రజా సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధులు, కుటుంబ సభ్యులు, కళాకారులు హాజరై సుదర్శన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పినాకపాణి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మరోసారి అధికారం కట్టబెడితే రెండేళ్ల వ్యవధిలో మావోయిస్టులను తుడిచి వేస్తామని ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. గడిచిన నాలుగు నెలల్లో 127 మంది ఆదివాసీలు, మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చిచంపారన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో డ్రోన్, బాంబు, వైమానిక దాడులు చేస్తున్నారన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేసే వరకు పోరాడాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో అమరుల బంధు మిత్రుల కమిటీ రాష్ట్ర కార్యదర్శి పద్మకుమారి, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.శ్రీనివాస్, విప్లవ రచయిత అల్లం రాజయ్య, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.కుమారస్వామి, సుదర్శన్ సోదరులు రఘు, కమలాకర్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

5 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు పట్టివేత



విత్తనాలు, నిందితులతో పోలీసులు

నెన్నెల: మండలంలోని బొప్పారంలో రూ.15 లక్షల విలువ చేసే ఐదు క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రామగుండం సీపీ శ్రీనివాసులు తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ్, ఎస్సై లచ్చన్న ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్ బొప్పారం గ్రామానికి చెందిన కర్ణకొండ చంద్రశేఖర్ ఇంట్లో సోదాలు నిర్వహించగా బియ్యం బస్తాల్లో దాచి ఉంచిన 5 క్వింటాళ్ల లూజ్ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా భైంసాకు చెందిన రజాక్ , మందమర్రికి చెందిన జాని వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేశానని సొల్లు పెద్దయ్య అలియాస్ సురేష్ అనే వ్యక్తి తన వద్దకు విత్తనాలు తీసుకువచ్చాడని చెప్పాడు. ఇందులో బెల్లంపల్లి మండలం చాకపల్లికి చెందిన సూరం దిలీప్, కాసిపేటకు చెందిన కల్లూరి వెంకటేషం కూడా భాగస్వాములుగా ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీపీ వివరించారు. సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ ఉన్నారు.

ప్రమాదవశాత్తు వరిగడ్డి దగ్ధం

చెన్నూర్‌రూరల్: మండలంలోని దుగ్నెపల్లిలో శనివారం మొగిలి రమేశ్ అనే రైతుకు చెందిన వరిగడ్డి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఇంటిపక్కనే ఉంచిన గడ్డికుప్పకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో సుమారు రూ.30 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.